సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విస్తృతంగా వాహనాల తనిఖీలు



వాహనదారుల వివరాలను సేకరిస్తున్న పోలీసులు

మల్కాపురం: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు బృందాలుగా ఏర్పడి వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం అర్ధరాత్రి ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ, శ్రీహరిపురం కూడలిలో తనిఖీలు చేశారు. గురువారం సాయంత్రం మల్కాపురం, ప్రకాష్ నగర్ తదితర ప్రాంతాలలో పలు వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో జరిగిన తనిఖీల్లో ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారిని, అనుమానితుల వద్ద పూర్తి వివరాలు, పలువురి నుంచి వేలు ముద్రలను సేకరించారు. జోన్–2 డీసీపీ ఆనందరెడ్డి పర్యవేక్షణలో మల్కాపురం సీఐ లూథర్ బాబు తన సిబ్బందితో ఈ తనిఖీలు సాగాయి.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ గులిగిందల లావణ్య పరిశీలించారు. ఇక్కడ శిథిలమైన సీసీ రోడ్డు స్థానంలో కొత్తది నిర్మిస్తున్నారు. ఈ పనుల నాణ్యతపై కాంట్రాక్టర్‌ను కార్పొరేటర్ లావణ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో లోపం ఉంటే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఉచిత శిక్షణకు విశేష స్పందన



విద్యార్థులకు గణితం బోధిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులకు విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 17న కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో పదో తరగతి విద్యార్థుల కోసం ఉచితంగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. బ్యాచీకి 60 మంది చొప్పున తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల బోధనకు ప్రత్యేకంగా ఫ్యాకల్టీని నియమించారు. గైస్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ గణిత బోధన తరగతులు నిర్వహించడం విశేషం. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ ఇస్తారు.

నేడు క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. గురువారం అమ్మవారికి ఘనంగా సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.

ఎండాకాలం.. ఏర్పాట్లు శూన్యం!

- జీవీఎంసీ జోన్–5లో కానరాని గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు
- మండువేసవిలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కంచరపాలెం మెట్టు జంక్షన్ వద్ద పరిస్థితి



హైవేపై కప్పరాడ బస్టాప్ వద్ద చెట్ల నీడలో ప్రయాణికులు(ఫైల్)



ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో బస్టాప్ వద్ద కానరాని గ్రీన్ షెల్టర్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో ఈ ఏడాది గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాల జాడ కనిపించడం లేదు. వేసవి కాలం మొదలై జనంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నా.. వాటి ఏర్పాటు దిశగా జోనల్ అధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో మండుటెండలో ప్రయాణికులు, బాటసారులకు అటు నీడ.. ఇటు తాగునీరు కరువైంది. జోన్‌లో 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. వాటి పరిధిలోని బస్టాప్‌ల వద్ద గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలను ఇంకా ఏర్పాటు చేయలేదు. ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావంతో అటు ప్రజలు.. ఇటు పాదచారులు విలవిల్లాడుతున్నారు. మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రస్తుతం స్వచ్ఛంద సంస్థలు, ఆయా కాలనీల కమిటీలు అక్కడక్కడా చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, తాగునీరు అందిస్తున్నాయి.

పట్టనట్లుగా అధికారులు..

జోన్ పరిధిలోని జ్ఞానాపురం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, కైలాపురం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, మర్రిపాలెం, కరాసా, ఎన్ఏడీ, బుచ్చిరాజుపాలెం, గోపాలపట్నం, ఎయిర్‌పోర్ట్, షీలానగర్, మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లోని బస్టాప్‌లకు ఆనుకుని గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సాధారణంగా వీటిని మేలో.. జోన్–5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తుంటారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే వేసవి ప్రభావం తీవ్రంగా ఉన్నా.. అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. జాతీయ రహదారులు, బీఆర్‌టీఎస్ మార్గాలు, ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో బస్సుల కోసం గంటల కొద్దీ షెల్టర్లలో వేచి ఉండాల్సి వస్తోందని, ఆ సమయంలో ఎండలు, వడగాల్పులను తట్టుకునే పరిస్థితి లేదని ప్రయాణికులు వాపోతున్నారు. గ్రీన్ షెల్టర్ల ఏర్పాటుతో కాస్త ఉపశమనం దొరుకుతుందంటున్నారు. జోన్–5 పరిధి ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల్లో కనీసం 36 నుంచి 42 వరకు గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు అవసరం ఉంటుందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి మండువేసవిలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మండుటెండలో తప్పని అవస్థలు



ఎండల తీవ్రతకు సొమ్మసిల్లేలా వడగాల్పులు వీస్తున్నాయి. బస్టాప్‌ల్లో ఎదురెండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నాం. ఎండ ప్రభావంతో షెల్టర్‌లో కుర్చీలు, రాడ్లు వేడెక్కుతున్నాయి. బస్టాప్‌లను ఆనుకుని గ్రీన్ షెల్టర్లు ఏర్పాటు చేస్తే కాస్తా ఉపశమనం దొరుకుతుంది.

– ఈతలపాక ఈశ్వరరావు, కంచరపాలెం

అధికారులు చర్యలు చేపట్టాలి



ఎండ వేడి, వడగాల్పులతో రోడ్డుపై నడవాలంటేనే గొంతెండుతోంది. దాహంతో దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. బస్టాప్‌లు, ముఖ్యమైన ప్రదేశాల్లో గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నాయుడు, ఆశవానిపాలెం

గ్రీన్ షెల్టర్లు ఏర్పాటు చేస్తాం



ఎండల తీవ్రత దృష్ట్యా ముందుగానే గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాల ఏర్పాటుకు కావాల్సిన సామగ్రి కొనేందుకు అంచనా నిధులు మంజూరు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలు ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించాం. ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించాం. మొదటి విడతగా అక్కడ గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం. రెండో విడతలో మిగతా వాటిని ఏర్పాటు చేయించి జోన్ ప్రజలకు అందుబాటులో ఉంచుతాం. చలివేంద్రాల నిర్వహణకు స్వచ్ఛంద సేవా సంస్థలు సహకరించాలి.

– ఆర్.జీవి.కృష్ణ, జోన్–5 కమిషనర్, జీవీఎంసీ

వంచన తెలియని నేత సీఎం వైఎస్ జగన్



ప్రజలకు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 61వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మల్కాపురం: సీఎం వైఎస్ జగన్ వెంట జనం ఉన్నారని, ఆయన వంచన తెలియని నాయకుడని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జగన్ అనే శక్తిని ఒంటరిగా ఎదుర్కోవడం రాష్ట్రంలో ఒక్క పార్టీ తరం కాదన్నారు. 61వ వార్డు గాంధీజీ వీధి సచివాలయం పరిధి ప్రాంతాలలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించారు. సంక్షేమ పథకాలతో ఏ మేరకు లబ్ధి పొందారో అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రజలను వంచన చేసేందుకు చంద్రబాబు అధికారం కోసం అలమటిస్తున్నారని, ఆ అవకాశం ప్రజలు ఇవ్వరన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ముత్యమాంబ పండగ



పూజలు చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: కంచరపాలెం మెట్టు కూడలిలో కొలువైన ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండగ గురువారం కనుల పండువగా జరిగింది. గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం గ్రామాధ్యక్షుడు భీశెట్టి వెంకటరావు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మకర తోరణం, వెండి కిరీటం, ఏడువారాల నగలతో అలంకరించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. వేకువజాము నుంచే కంచరపాలెం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు ముత్యమాంబను దర్శించుకుని, మొక్కులు సమర్పించుకున్నారు. వారికి ఉత్సవ నిర్వాహకులు మజ్జిగ, శీతల పానీయాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, ఎమ్మెల్యే పి.గణబాబు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టబంగారం వద్ద నుంచి అమ్మవారి ప్రతిమలను ఆలయం వద్దకు చేర్చారు. అనంతరం ప్రతిమల అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు భీశెట్టి వీరబాబు, పి.కె.వి.రమణ, పాలమరశెట్టి రాజు, రామకృష్ణ కాళ్ల రామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా నూకాలమ్మవారి నెల పండగ



భక్తులకు ప్రసాదం అందిస్తున్న మళ్ల సతీష్, బుద్ధా శివాజీ, తదితరులు

గోపాలపట్నం: నూకాలమ్మ అమ్మవారి నెల పండగ గురువారం గోపాలపట్నంలో ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మళ్ల సతీష్, కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధా శివాజీ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సాయంత్రం భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్ని గుండం తొక్కారు.

చురుగ్గా 'మా నమ్మకం నువ్వే జగన్'



59వ వార్డులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న కన్వీనర్లు, గృహసారథులు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాలతో కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం గురువారం 59వ వార్డు పాత చెక్‌పోస్టు ఏరియాలో చురుగ్గా జరిగింది. సచివాలయం కన్వీనర్లు ఏదిరి సత్యనారాయణ, ఒమ్మి మహేష్ గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

పెనాల్టీల నుంచి ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి



బ్యాంకు చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట : బ్యాంకులు పెనాల్టీలు, చార్జీల నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగ సంఘాల కార్యాచరణ సమితి (అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన జరిగింది. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట జరిగిన ప్రదర్శనలో జేఏసీ చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ బ్యాంకులు విధించే పెనాల్టీల వల్ల ఉద్యోగుల సిబిల్ స్కోరు తగ్గిపోతుందని, దీని నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చి, అదనపు భారాన్ని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ రమేష్, కోశాధికారి రవిశంకర్, జేఏసీ కో చైర్మన్ నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, ఉద్యోగులు, పెన్షనర్లు హాజరయ్యారు. అనంతరం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



మంటలు ఆర్పడంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సింధియా: షిప్‌యార్డ్‌లో ఈ నెల 14న ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ సేఫ్టీపై అవగాహన పెంచడానికి అగ్నిమాపక సిబ్బంది నిర్వహించిన మాక్‌డ్రిల్ ఆకట్టుకుంది. ఉద్యోగులు, కార్మికులు పనిచేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో సేవా స్ఫూర్తి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని పెంచేలా ఎన్ఎస్ఎస్ నిలుస్తుందని ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం ఏయూ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వర్సిటీకి దగ్గరలో ఉన్న రెల్లివీధి ప్రాంతాన్ని దత్తత తీసుకుని వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎన్ఎస్ఎస్‌లో యువత భాగస్వాములై విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ 7 రోజుల పాటు 7 ప్రత్యేక కార్యక్రమాలను చేపడతామన్నారు. తొలి రోజున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు జి.గిరిజా శంకర్, వి.గిరిజా శాస్త్రి, కె.ఈశ్వర్ కుమార్, కె.సంతోష్, అరుణ్‌కుమార్, ఎం.సంజయ్ సుమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంద్రసేనకు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగ పరిశోధక విద్యార్థి ఇంద్రసేన పాలకు ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ విశ్రాంత ఆచార్యులు ఇ.ఎ.నారాయణ, డాక్టర్ పి.ప్రేమానందం సంయుక్త పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ ఎన్‌జీవో ఇన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఇన్ నార్త్ కోస్టల్ డిస్ట్రిక్ట్స్–ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ఇంద్రసేన పాల స్వీకరించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్లాట్‌ఫాం నంబర్–8లో వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్–8లో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా.. గురువారం ఉదయం 5.45 గంటల ప్రాంతంలో విశాఖ రైల్వేస్టేషన్ 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. ఏదో రైలు నుంచి జారిపడటం గానీ, లేదా రైలు ఎక్కుతున్న సమయంలో జారి పడటం వల్ల గానీ మరణించి ఉండవచ్చు. మృతుడి వయసు సుమారు 30–35 ఏళ్లు ఉంటుంది. ఇతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి పసుపు, తెలుపు రంగు టీ షర్ట్, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మెడలో నలుపు రంగు తాడు, కుడిచేతి మీద నాగు పాము, ఓంకార గుర్తులు పచ్చబొట్లు ఉన్నాయి. ఈ మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ వద్ద స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో తెలియజేయాలని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

మాల మహానాడు నాయకుడు త్రిమూర్తులు దుర్మరణం



త్రిమూర్తులు(ఫైల్)

బీచ్ రోడ్డు: ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి పడిపోవడంతో ఉమ్మడి విశాఖ జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు జంగ త్రిమూర్తులు(56) దుర్మరణం చెందారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. పెదగదిలిలో నివాసం ఉంటున్న త్రిమూర్తులు ఏయూలో ఉద్యోగం చేస్తున్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మీదుగా మద్దిలపాలెం వైపు వస్తుండగా అదుపు తప్పి రోడ్డు మీద పడిపోయారు. తలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఆయన మృతిపట్ల దళిత నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ, విశాఖ డెయిరీ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ముందు కొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవికాలం అంతా చలివేంద్రం నిర్వహిస్తారని అన్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి 100 నుంచి 200 మంది అర్జీదారులు వస్తారని, వారికి భోజనం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో కూడా చలివేంద్రం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విశాఖ డెయిరీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ ఎస్‌కేఎల్ రావు, విశాఖ డెయిరీ మార్కెటింగ్ మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ, అన్నదానం



63వ వార్డులో మహిళలకు చీరలను అందిస్తున్న తోట రత్నం

సింధియా/మల్కాపురం: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా గురువారం 63వ వార్డు క్రాంతినగర్‌లో టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షురాలు తోట రత్నం ఆధ్వర్యంలో మహిళలకు చీరలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. 62వ వార్డులో కార్పొరేటర్ గల్లా చిన్నా, వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గణబాబు కేక్ కట్‌చేశారు. గుడివాడ అప్పన్న కాలనీలోని శివసాయి ఆలయంలో పూజలు నిర్వహించి అన్నసమారాధన ప్రారంభించారు. మల్కాపురంలోని ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో పార్టీ క్రిస్టియన్ మైనారిటీ పార్లమెంట్ అధ్యక్షుడు ఉరుకూటి డేవిడ్ పేదలకు చీరలు పంపిణీ చేశారు.

సమస్యల వలయంలో నందమూరినగర్



నందమూరినగర్‌లో శిథిలమైన కాలువ



కాలువపై విరిగిన పలకలు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు నందమూరినగర్‌లో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇక్కడి వీధి కాలువలు శిథిలమైపోయాయి. దీంతో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోయింది. మరోవైపు పారిశుధ్య కార్మికులు కూడా వారానికి ఒక్కరోజైనా కాలువలను శుభ్రం చేసిన దాఖలాలు ఉండడం లేదు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణే తప్ప, వీధి రోడ్లు, కాలువలు శుభ్రం చేయడం వంటి పనులు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓ వీధి కాలువపై ఉన్న సిమెంట్ పలకలు విరిగిపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నందమూరినగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పుస్తకాల బహూకరణ



పుస్తకాలు బహూకరిస్తున్న డాక్టర్ సులేమాన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగానికి డాక్టర్ సులేమాన్ పలు పుస్తకాలను బహూకరించారు. విభాగ విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఉపయుక్తంగా రూ.3 వేలు విలువ చేసే పుస్తకాలను గురువారం విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజుకు అందజేశారు. డాక్టర్ సులేమాన్ విభాగంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. ఈయన భారత ప్రభుత్వంలో ఉన్నతోద్యోగిగా సేవలు అందించి పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.